రైతులపై సాగుభారం

- జిల్లాలో జోరుగా వ్యవసాయ పనులు
- పెరిగిన పెట్రోల్, డీజిల్
- రెట్టింపవుతున్న యంత్ర సామగ్రి ధరలు
- పెట్టుబడి వ్యయంతో రైతుల ఆందోళన



ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో పంటలపై రోజురోజుకు సాగు భారం పెరిగిపోతోంది. ఏటేటా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు చేలను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇంధనం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతుపై మరింత సాగు భారం పడుతోంది. ఒక్కో గ్రామంలో సుమారు 10 నుంచి 20 ట్రాక్టర్లు ఉన్నాయి. పెరిగిన ఇంధన ధరలతో పంట సాగు చేయడం కష్టమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏటేటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నా దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మండుతున్న ఇంధన ధరలు..

జిల్లాలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ.110 ఉండగా, డీజిల్ రూ.99గా ఉంది. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు ఊపందుకోవడంతో గ్రామాల్లో ట్రాక్టర్లు బిజీగా మారిపోయాయి. సీజన్ ప్రారంభమైన ఇంధన ధరలు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులకు వ్యవసాయం మరింత భారంగా మారింది. వేసవి దుక్కులు చేపడుతూ పంట చేలను చదును చేసుకుంటున్నారు. ఎండలు ముదిరిపోవడం, ఈ సమయంలో వేసవి దుక్కులు చేపడితే మంచి ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుతున్న అద్దె ధరలు

ఇంధన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దె ధరలు పెంచడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతుంది. ఏటా గంటకు రూ.100 నుంచి రూ.200 వరకు అద్దెలు పెంచేస్తున్నారు. ఎందుకంటే ఇంధన ధరలు పెరగడంతో తమకేమి గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పని చేసేలా సాగు పనుల్లో రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం యంత్రాలతో వేసవి దుక్కులు దున్నడం, పంట చేలను చదును చేయడం, చెరువులు, కుంటల నుంచి నల్ల మట్టి, సేంద్రియ ఎరువు తరలించడం, పత్తి కర్రలు తొలగించడం తదితర పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే ఇంధన ధరలే పెరిగాయన్న సాకుతో ట్రాక్టర్ల యజమానులు అద్దెలు అమాంతంగా పెంచుతున్నారు. గత్యంతరం లేక రైతులు అధిక అద్దెలను చెల్లించక తప్పడం లేదు.

ఏటా కోట్ల భారం..

ఇందన ధరలు పెరిగిపోవడంతో రైతాంగంపై ఏటా కోట్ల రూపాయల ఆర్థికభారం పడుతుంది. దీంతో పంటలు సాగు చేయడం కష్ట సాధ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 1,19,978 మంది రైతులు ఉండగా 4,50,000 ఎకరాల్లో ప్రతి ఏటా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. దున్నినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. గత ఐదేళ్ల క్రితం వరకు ఎకరాకు రూ.10 వేల నుంచి 15వేల వరకు ఖర్చు అవుతుండగా, ప్రస్తుతం ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరత, యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రైతులపై కోట్ల రూపాయల భారం పడుతుందంటున్నారు.

ఇంధన ధరలు తగ్గించాలి



పంటల సాగుకు పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. ఇంధన ధరలు పెరగడంతో ప్రతి పనిపై పరోక్షంగా పడుతుంది. ఎరువులు, విత్తనాల ధరలు డబుల్ అవుతున్నాయి. ఖర్చు చేసి పంటలు పండిస్తే తీరా విక్రయానికి వెళ్తే గిట్టుబాటు ధర రావడం లేదు. ప్రభుత్వం రైతుకు భరోసా కల్పించాలి. – **మొర్లె మెండి, రైతు, బోర్ద**

క్లుప్తంగా

'జీపుజాత' జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

దహెగాం: అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని డిమాండ్‌తో చేపట్టే జీపుజాతను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో జీపు జాత శుక్రవారం ప్రారంభమై కుమురం భీం జిల్లాకు శనివారం ప్రవేశిస్తుందన్నారు. రోజ్‌గార్డెన్‌లో నిర్వహించే బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం జీపుజాత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయప్రద, మల్లీశ్వరి, జ్యోతి, భాగ్య, గీత మమత పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు భూమిపూజ



పోతెపల్లిలో భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి, లోడుపల్లి, అగర్‌గూడ గ్రామాలకు పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు. సర్పంచులు దాసరి చంద్రమౌళి, జాజిమొగ్గ శ్రీనివాస్, పాలె సుధాకర్, ఉపాసీ సంజీవ్, ఎంపీడీవో గంగాసింగ్, ఏఈ మక్బూల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెజ్జూర్ ఎస్సైపై చర్య తీసుకోవాలి



డీఎస్పీకి అందించిన ఫిర్యాదుపత్రాన్ని చూపిస్తున్న రావి శ్రీనివాస్, తదితరులు

కాగజ్‌నగర్‌టౌన్: బెదిరింపులకు పాల్పడుతున్న బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ డీఎస్పీ కరుణాకర్‌కు సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వారెంట్ లేకుండా తనిఖీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళల ఇంట్లో చొరబడి సోదాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇబ్బందులకు గురిచేస్తున్న ఎస్సైను సస్పెండ్ చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏఈవో తాండవకృష్ణ

వాంకిడి: మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లులు, రికార్డులు, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం ఏఈవో తాండవకృష్ణ మాట్లాడుతూ రైతులు విత్తన కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మండల అధికారులు పూర్తి నివేదికలతో రావాలని ఆయన సూచించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: వికలాంగులకు రూ.3,016 నుంచి రూ.4,116కు పింఛన్ పెంచిన సందర్భంగా చైతన్య దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఎండీ ఖయ్యుమ్, అరవిందర్, మునీర్, నజీరా, సాహిల్, ప్రవీణ్, రమాకాంత్, షమీమ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ట్యాంకర్ టైర్లు చోరీ



టైర్లు లేకుండా ఉన్న వాటర్ ట్యాంకర్

రెబ్బెన: మండలంలోని రాంపూర్ పంచాయతీకి సంబంధించిన వాటర్ ట్యాంకర్ టైర్లు బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. సర్పంచ్ చాపిడి జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే పంచాయతీ నర్సరీకి నీళ్లు పట్టించిన అనంతరం ట్యాంకర్‌ను నర్సరీ వద్ద ఉంచారు. గురువారం ఉదయం నర్సరీకి వచ్చిచూడగా ట్యాంకర్ రెండు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన టైర్ల విలువ రూ.50వేలు ఉంటుందని తెలిపారు.

దేవతామూర్తులకు జలాభిషేకం



గంగాజలంతో మహిళలు

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆలయాల్లోని దేవతామూర్తులకు గురువారం జలాభిషేకం చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం పోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి, పోతరాజు శిలా విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. గ్రామ సమీపంలోని పెద్ద వాగు నుంచి తీసుకువచ్చిన జలంతో పోచమ్మ ఆలయాన్ని శుద్ధి చేశారు. మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



కార్మికులను సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్

కెరమెరి: గ్రామాల స్వచ్ఛతలో అందరూ భాగస్వాములు కావాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఝరి, మోడి గ్రామ పంచాయతీల్లో గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులు సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. గ్రామాలను చెత్తాచెదారం లేకుండా ఉంచడంలో వారు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. జెడ్పీటీసీ దుర్పతబాయి, సర్పంచ్‌లు సోంబాయి, న్యానేశ్వర్, కార్యదర్శి ధర్మయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సంఘం సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ పెద్దలను గౌరవించాలని, వారి పట్ల ప్రేమగా ఉండాలన్నారు. వారి పోషణ బాధ్యత పిల్లలదే అని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, డివిజన్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. సభ్యులు మురళీధర్‌రావు, అబ్దుల్ వాహబ్, కలికోట రమణయ్య, జయదేవ్, ఝెల్లా గౌడ్, బావండ్లపెల్లి నర్సయ్య, అల్లి రాజయ్య, సుభాష్, మునీశ్వర్, జి.శంకర్, బి.రాజమలు, తూడూరి ప్రకాశ్, విజయ్‌సింగ్, దిలీప్‌గౌడ్, దేవయ్య, బంగారు బాబు, బుచ్చన్న, జగదీశ్వర్, కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, కిష్టయ్య, సమద్ భాయ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో విధులు నిర్వహిస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏరియాకు చెందిన నలుగురు కార్మికుల వారసులు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఉద్యోగి కుటుంబ సభ్యులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎస్‌వోటూజీఎం గుప్తా, డీవైసీఎంవో శౌరి, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లోకి పంపించాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రమేశ్

కెరమెరి: బడీడు పిల్లలను పాఠశాలల్లోకి పంపించాలని ఇగోయగాం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నల్లగొండ రమేశ్ అన్నారు. బడిబాటలో భాగంగా మండలంలోని భీమన్గొంది గ్రామంలో గురువారం ఆయన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తారని అన్నారు. పిల్లలను సర్కారు బడికి పంపించాలన్నారు. ఆయన వెంట టీచర్ మురళి ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులందరినీ బడిలో చేర్పించాలి

రెబ్బెన: బడీడు దివ్యాంగ విద్యార్థులందరినీ బడిలో చేర్పించాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అండ్ మీడియా కోఆర్డినేటర్ సత్తయ్య జంబోబు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, బడిబాటలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో వెంకటేశ్వరస్వామితో కలిసి గురువారం దివ్యాంగుల విద్యార్థుల అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల్లో వారిని చేర్పించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రవాణా భత్యం, రీడింగ్ అలవెన్సులను బాలికలకు స్టైఫండ్ అలవెన్సులు అందిస్తుందని తెలిపారు.

'డీబీఎల్ వాహనాల వేగాన్ని నియంత్రించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ పనులకు వినియోగిస్తున్న డీబీఎల్ కంపెనీ వాహనాల వేగాన్ని నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. కంపెనీకి చెందిన టిప్పర్లు అధిక వేగంతో వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటురని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఊరూరా పల్లె ప్రగతి దినోత్సవం



కెరమెరిలో ర్యాలీ



చింతలమానెపల్లిలో..



కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్



బెజ్జూర్: ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సిబ్బంది



దహెగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కెరమెరి/కౌటాల/చింతలమానెపల్లి/బెజ్జూర్/దహెగాం/పెంచికల్‌పేట్/సిర్పూర్(టి)/కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల వద్ద ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగురవేశారు. పల్లె ప్రగతి ద్వారా వచ్చిన నిధులు, సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులు వివరించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించి ప్రశంసపత్రాలు అందజేశారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఐకేపీ ఆధ్వర్యంలో యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామాల్లో పల్లెపకృతి వనాల నుంచి ర్యాలీలు నిర్వహించారు. ఎంపీపీలు పెందోర్ మోతిరాం, బసర్కార్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ దుర్పతబాయి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



కొండపల్లిలో సన్మానిస్తున్న సర్పంచ్ సంజీవ్



సిర్పూర్(టి): చీలపెల్లి గ్రామంలో ర్యాలీ



గురుడుపేటలో జెండా వందనం చేస్తూ..

మాలీలకు ఆర్థికసాయం అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, బీసీ కులవృత్తులకు అందిస్తున్న విధంగా రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని మాలీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడే కు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న మాలీ సామాజిక వర్గాన్ని ఆదుకోవాలని కోరారు. నాయకులు నాందేవ్, సుధాకర్ ఉన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ భవనాన్ని ఎంపీపీ పెందోర్ మోతిరాం ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో భవనం నిర్మించినట్లు ఎంపీపీ తెలిపారు. అనంతరం బాబేఝరి పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ మానిక్‌రావు, గ్రామ పెద్ద రాథోడ్ సుభాశ్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పేకాటరాయుళ్లపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.13 గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1460 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

యూడీఐడీ కార్డులు పంపిణీ చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: దివ్యాంగులకు వెంటనే యూడీఐడీ కార్డులు పంపిణీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకుడు ఆనంద్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలకు యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డు తప్పనిసరి చేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ యజ్ఞం



శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న యజ్ఞం

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం భక్తిశ్రద్ధలతో గాయత్రయజ్ఞం నిర్వహించారు. పాఠశాల పునఃప్రారంభమైన నేపథ్యంలో పూజలు చేశారు. పోషకులు రావుల సంతోశ్‌కుమార్, లావణ్య దంపతులు యజ్ఞంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల విభాగ్ శిక్షణిక్ ప్రముఖ్ పూదరి సత్యనారాయణ మాట్లాడుతూ శిశు మందిరాలు క్రమశిక్షణకు నిలయాలన్నారు. పాఠశాల కార్యదర్శి కొలిప్యాక వేణుగోపాల్, రాఘవగౌడ్, వాసుదేవన శైలేశ్, కోట వెంకన్న, ఖాండ్రే విశాల్, దరిపెల్లి కృష్ణమాచార్యులు, హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.